
# తెర




"అయితే ఎంకన్న తాతా సినేమా ఏట్టర్లంతా పట్నంలోనే నన్నమాట వుండేది!" అన్నాడు సీనయ్య.

"కాక మన సీతారాంపురంలో వుంటా రనుకున్నావేటి! సినిమాలన్నీ చేసేది పట్నంలోనే గందా. మరి ఆళ్ళంతా ఆడుండక మరేడుంటారనుకున్నావొరే ఎర్రిసన్నాసి!" అన్నాడు నర్సిగాడు.

"తాతా! మనూరికెప్పుడైనా ఓ సినేమా స్టారుని పిల్చుకొచ్చి మాకు సూపించ రాదా? అన్నేళ్ళుగా అళ్ళకాడ పన్జేస్తు న్నావుకదా" అన్నది సిగ్గుపడుతూ సీతా లచ్చిమి.

"ఓసినీ . మనూరికి ఈ ఎంకటేస్సరా టూరింగుటాకీసు తప్ప అపలైన సిమ్మెంటు హాలైనా లేదే. సినిమా స్టార్లెట్టా వొస్తారనుకున్నావే?" అన్నాడు ఎంకటేసు.

"మొన్న రాములోరి సినేమాలో సీతా దేవిగా ఏసిందే ఆయమ్మ బంగళా మన పెదనాయుడుగారి మండువా అంత ఉంటదా?" అన్నాడు పాలేరు పోరిగాడు.

"ఓరే పోరిగా. మీ నాయుడుగారి బంగళా అంతా కలిపి ఆయమ్మగారి పడగ్గదంత వుండదు తెల్పిందా. నాయుడుగోరి కుటుంబానికంతా కలిసి ఒకరోజు అయ్యే కర్చు ఆయమ్మగారి అల్సేసనుడాగు-సీమ కుక్క-న్నమాట - అది ఒక పూట తినే తిండికి సరిపోదు ఏటనుకున్నావో. ఆయమ్మగారి కారెలా గుంటదో తెల్సా? పూలరదం నాగుంటది. ఎండాకాలంలో సల్లగా, సలికాలంలో ఎచ్చగా వుంటాది అందులో కూకుంటే. నే జెప్పింది అబద్దమైతే ఎంకన్న తాతనే అడుగు" అవి తాత కేసి చూసేడు, పోయినాసారి ఎలక్సన్లప్పుడు పంచాయితీ కర్చులతో లారీమీద ఇందిరమ్మ మీటింగుకు పట్నం ఎల్లొచ్చిన ఎంకటేసు.

ప్రశ్నలూ, జవాబులూ తామే చెప్పు కుని ఆనందిస్తున్నారు తాతచుట్టూ చేరిన వాళ్ళు, అన్నిటికీ చిరునవ్వుతో తలూపుతూ చుట్టపీలుస్తూ కూర్చున్నాడు ఎంకన్న తాత.

సినిమాలు తీసే పట్నానికి వందా యాభైమైళ్ళ దూరంలో వుంది ఆ వూరు. టూరింగు టాకీసులో తెరమీద చూట్టం తప్ప సినిమా తారల్ని ప్రత్య క్షంగా చూసి తరించే భాగ్యానికి ఆ వూరి ప్రజలింకా నోచుకోలేదు. కాని ఒక అదృష్టం మాత్రం వాళ్ళకు దక్కింది ఎంకన్నతాత రూపంలో.

ఏడాదికోసారి ఆ వూరొచ్చి వారం రోజులుండి వెళ్ళే ఎంకన్నతాతంటే ఆ వూరి కుర్రకారుకి వల్లమాలిన అభిమానం. వాళ్ళ దృష్టిలో ఎంకన్న తాత సినిమా స్టారంత ప్రముఖ వ్యక్తి. ఊళ్ళో వున్న ఆ వారంరోజులూ వాళ్ళూహించుకున్న సినీమా(య) లోకాన్ని గురించిన వింతలూ, విడ్డూ రాలూ వినిపించి స్వప్నజగత్తులో ఆ జనాన్ని విహరింపజేసి ఆనందించటం అతనికి ఓ రకమైన తృప్తినిచ్చేది.

ఎంకన్నతాత మద్రాసులో ప్రముఖ సినీతార శోభారాణి ఇంట్లో తోటమాలిగా పన్జేస్తున్నాడు. కాని వూళ్ళో మాత్రం అందరితోటి తను ఆమెగారికి నమ్మిన బంటులాంటి వాడినని చెప్పుకుంటూ వుంటాడు. పదేళ్ళకిందట వున్న కాస్త

పోలయ్యా అమ్మి కూతురికి పెళ్ళి జరిపించేడు. అల్లుడికి పట్నంలో సినిమా స్టూడియోలో ఏదో చిన్న వుద్యోగం. "ఇంకా ఏముందని ఈ వూళ్ళో వుంటావ్? పట్నం వచ్చెయ్ ఏదైనా పనిప్పిస్తాను" అని అల్లుడే ఎంకన్నతాతని శోభారాణి ఇంట్లో తోటమాలిగా కుదిర్చేడు. పుట్టి పెరిగిన వూరిమీద మమకారం వొదులుకోలేక సంవత్సరానికోసారి సీతారాంపురం వచ్చిపోతుంటాడు ఎంకన్నతాత.

బాగా చీకటిపడింది.

టూరింగు టాకీసులో పాటలాగిపోయినయ్, సినిమా మొదలెట్టే వేళైంది ఆ రోజుకి ఎంకన్న తాతతో గోష్టి ముగించుకుని ఇళ్ళకు వెళ్ళటానికి లేచారు అంతా. అప్పటిదాకా అక్కడ చేరి వాళ్ళ మాటలన్నీ మౌనంగా వింటూ కూర్చున్న సిన్నోడు ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాడు. ఆ రాత్రంతా సిన్నోడికి నిద్రపట్టలేదు. సినిమా గురించీ, సినిమాలో చూసిన సీతమ్మ గురించి, ఆ పాత్రలో అద్భుతంగా నటించిన శోభారాణి గురించీ ఆలోచిస్తూనే వున్నాడు. 'సీతాచరితం' సినిమాని అప్పటికి నాలుగు సార్లు చూసేడు సిన్నోడు. సీతాకళ్యాణం సీనులోని సీతలో కనిపించిన సొయగానికి పులకింతలు వేసింది వాడి మనసు. శీల పరీక్ష దృశ్యంలో సీతమ్మవారు అగ్ని ప్రవేశం చేస్తుంటే ఆడపిల్లలా వలవలా ఏడ్చేసేడు. ముని ఆశ్రమంలో కుశ లవుల తల్లిగా సీతలో వుప్పొంగిన మాతృత్వానికి కనులు చెమర్చేడు. ఒకసారి పట్నం వెళ్ళి శోభారాణిని చూసిరావాలని తహతహలాడిపోయేడు. ఎంకన్న తాత అయ్యమ్మగారింటనే పన్జేస్తున్నాడు. ఎంతదృష్టమో తాతకి. రోజూ ఆమెని చూస్తుంటాడు.

నాన్న ఒప్పుకోడుగాని ఆమె దగ్గర పనిపిల్లవానిగానైనా చేరి రోజూ ఆమెకు సేవలు చేస్తూ గడపటం కూడా ఎంత బావుంటుందో! రేపే ఎంకన్నతాత నడగాలి తనకోసారి ఆమెని చూపించమని. పెద్ద కష్టమైన పనేంకాదు తాతకి అనుకుంటూ నిద్రపోయాడు సిన్నోడు.

తెల్లవారింది.

కాఫీ హోటేలుకాడ ఎంకన్నతాతని కలుసుకుని తన కోరికని వెల్లడించేడు బిడియపడుతూ.

"మీ అయ్య ఒప్పుకోవద్దూ?" అన్నాడు ఎంకన్నతాత.

"నువ్వే ఎట్టాగైనా ఒప్పించాలి తాతా, నువ్వు చెప్తే కాదనడు మా అయ్య" అన్నాడు జాలిగా సిన్నోడు. ఎంకన్న తాతకు సిన్నాడంటే మొదట్నించీ ఒక రకమైన అభిమానం. తన మనవడు అచ్చంసిన్నోడిలాగే వుండేవాడు. దాదాపు ఇద్దరూ ఒక ఈడువాళ్ళే. అయిదేళ్ళ కిందట ఇసజౌర మొచ్చిపోయేడు.

"పరే! ఇయ్యాల మీ అయ్యకో మాట్లాడతాలే."

సిన్నోడు ఎగిరి గంతేసేడు. దేవతని చూపించటానికి పూజారయ్య వరమిచ్చినట్టుగా సంబరపడిపోయాడు.

"చూడు రామయ్యా! ఏదో సరదా పడ్తుండాడు. అయినా మరీ సిన్నోడేం కాదు. మరో రెండేళ్ళకి పదో కళాసు కెళ్ళేవోడు. అదూ పెపెంచగ్గేనం తెల్సుకోవద్దా? ఇంతదాకా పట్నం తీసికెళ్లలేదంటివి. అయినా నీకు పెద్ద కర్సేం కాదు. రానూ పోనూ చార్జీలకో పాతిక. పట్నమంతా తిరిగి సూడ్డానికి మరో పాతిక వుంటే సాలు. రెండ్రోజుల్లో తిరిగొచ్చేస్తాడు. పట్నంలో పొద్దున బసెక్కేస్తే మనూళ్ళో సందేళకి దిగిపోతాడు. నామాటివి వాడిస్టం కాదనకు," అని నచ్చజెప్పి వొప్పించాడు వెంకన్న తాత.

ఊళ్ళో నేస్తాలందరికీ తను సినిమాలో సీతమ్మగా ఏసిన ఏట్టర్ని సూడబోతున్నానోచ్ అని చెప్పుకుని అందలమెక్కినంత సంబరపడ్డాడు. పట్నంనుంచి వొచ్చేటప్పుడు అయమ్మ సంతకం చేసిన 'పుటోగరాపు' కూడా తెస్తానని చెప్పుకున్నాడు సిన్నోడు.

మర్నాటిరోజు పొద్దున్నే ఎంకన్న తాతతో పట్నంకు బసెక్కాడు సిన్నోడు. సీమ కెళుతున్నంతగా వుప్పొంగిపోయేడు

పట్నం చేరి శోభారాణి బంగళా చేరుకునేసరికి రాత్రి తొమ్మిది దాటింది.

గేటుకాడ బీడీ వెలిగించిన గూర్ఖా సిన్నోడివి ఎగాదిగా చూసేడు. హిందీలో తాత ఏదో చెప్పగానే లోపలికి రానిచ్చేడు.

ఆకుపచ్చరంగులో అదేదో సినిమాలో లాగుంది శోభారాణి భవంతి. గేటుకి బంగళాకు మధ్యవున్న బాట కిరుపక్కలా రకరకాల చెట్లు. బంగళా ముందు పచ్చని లాన్. మధ్యలో నీళ్ళు చిమ్మే ఫౌంటెన్. వింతగా చూస్తూ వడుస్తున్నాడు సిన్నోడు. కారు హారన్ రెండుసార్లు మోగింది. లేతాకుపచ్చరంగు ఖరీదైన కారు బంగళా ముందాగింది.

"సూడు,సూడు అమ్మగారొచ్చేశారు," అన్నాడు తాత సిన్నోడి భుజం తట్టి.

కారులోంచి తూలుతూ దిగింది సినీతార శోభారాణి. ఆమె తలంతా రేగి వుంది. భుజాల చుట్టూ చేతులు వేసి పట్టుకుని నడిపించికొస్తున్నాడు భర్త. స్తంభాల చాటున నక్కి నక్కి చూస్తోన్న సిన్నోడికి బ్రాందీ వాసన గుప్పున కొట్టింది. గుమ్మం మెట్లెక్కుతూ తూలిపడబోయిన శోభారాణిని గట్టిగా పొదివిపట్టుకున్నాడు భర్త.

"యూ బాస్టర్డ్! ఒదల్రా నన్ను .. ఒదులు. నన్ను ముట్టుకోకు" అని ఇంక ఏవో బూతులు తిడుతూ పెనుగులాడుతోంది ఆమె.

"డ్రైవర్! డ్రైవర్!" గట్టిగా అరిచాడు భర్త.

ఇద్దరూ పట్టుకుని హాల్లో సోఫామీద పడుకోబెట్టారు శోభారాణిని.

'సీతాచరితం' సినిమాలో సీతాదేవిగా వేసింది ఈ అమ్మేనా తాతా?" అడిగేడు చిన్నోడు వాడికంతా అయోమయంగా వుంది. నమ్మకం కుదరటంలేదు.

"అవున్రా, ఈ యమ్మే. ఇప్పుడు మన లోకంలో లేదు. తెల్లారేక నిన్ను పరిచయం సేత్తాను మాట్లాడుదువుగానిలే" అని చిన్నగా చెప్పేడు తాత.

హాల్లోకి నక్కి నక్కి చూస్తోన్న చిన్నోడ్ని ఎవరన్నట్టుగా చూసేడు సినీతార భర్త.

"నా మనవడండి పట్నం సూడాలంటే పిల్చుకొచ్చేను. నాతోబాటు అవుటవుతోసు రెండ్రోజులుండి ఎల్తాడు," అన్నాడు తాత వినయంగా.

ఫ్రిజ్‌లోంచి అయిసు తెచ్చి శోభారాణి ముఖం తుడిచేడు భర్త. ఐసు సంచీని తలమీద పెట్టేడు.

కాసేపటికి తేరుకుంది శోభారాణి.

"చూడు శోభా! మరి కాసేపట్లో ప్యారేలాల్ వొస్తున్నాడు నీకోసం. వాడో మల్టీస్టారర్ తియ్యాలనుకుంటు న్నాడు. నాలుగు తెలుగు సినిమాల్లో వేస్తే వొచ్చేదానికంటె ఎక్కువే వొస్తుంది, ఈ ఒక్క హిందీ సినిమాలో ఛాన్సు దొరికిందంటే నీకు. అంచేత నువ్వు ప్యారేలాల్‌తో..." బతిమాలు తున్నాడు భర్త.

"నువ్వూ వాడు గంగలో కలవండి. వాడంటేనే నా కసయ్యం. ఐ హేట్ హిమ్. ఐ హేట్ హిస్ బెల్లీ. నన్ను విసిగించక ముందిక్కడ్నించి వెళ్ళు. గెటవుట్."


"ప్లీజ్.నెమ్మదిగా మాట్లాడు ఎవరైనా వింటే బావుండదు. ఎంతైనా నీ భర్తని."

"అహహ మొగుడంటే మొగుడు! నువ్వు తార్పుడుగాడివిరా, మొగుడివి కాదు"

"పోనీ అలాగే అనుకో. తార్చకుంటే నువ్వీరోజు ఇంత గొప్ప తారవి అయివుండేదానివి కాదు. ఆ సంగతి నీకూ తెలుసు. శోభా! నా మాటవిని ఈ ఒక్కసారికి ప్యారేలాల్‌ని సంతోష పెట్టు ప్లీజ్."

"నో నో నా కిప్పుడు హరిబాబు కావాలి. ఫోన్ చేసి వెంటనే పిలిపించు."

"హరిబాబు కిప్పుడు మార్కెట్ పడి పోయింది. ఇండస్ట్రీలో మంచి పేరు కూడా లేదు. నువ్వింకా వాడితో తిరగటం నీ భవిష్యత్తుకంత మంచిది కాదు. అయినా వాడిప్పుడు వూళ్ళో లేడు. టయిమయిపోతోంది శోభా! మరో అర్ధ గంటలో ప్యారేలాల్ దిగుతాడు. నా కోసం ఈ ఒక్కసారికి నీ మూడ్ మార్చుకుని ఫ్రెష్‌గా తయారవు. వచ్చి బట్టలు మార్చుకో. కమాన్," అని ఆమెని పడగ్గదిలోకి తీసికెడుతున్నాడు భర్త.



కాపేపటికి బరిగళా ముందు కారాగింది. అందులోంచి ప్యారేలాల్ దిగాడు.

"సిన్నోడా మనం పోదాంరా. పొద్దున్నే వచ్చి అమ్మగార్ని కలుసుకుందాం," అని సిన్నోడ్ని అవుటవుసుకి తీసుకెళ్ళాడు తాత. సిన్నోడికంతా వింతగా వుంది. తన కళ్ళని తానే నమ్మలేకపోతున్నాడు. శోభారాణిని గురించి సినిమా పత్రికల్లో చదివిందంతా మనసులో మెదిలింది సిన్నోడికి


"చిన్నప్పట్నించి నాకు సీతమ్మవారు అంటే చాలా భక్తి. సీత నా ఆరాధ్య దైవం. మా యింట్లో ఎందరు దేవుళ్ళున్నా సీతమ్మవారి విగ్రహాన్ని ఎప్పుడూ ఒళ్ళో పెట్టుకుని నిద్రలో కూడా ఒదిలిపెట్టేదాన్ని కాదుట. సినిమా రంగంలో కాలుమోపిం తరువాత ఎన్నటికైనా సీతాదేవి పాత్రను ధరించాలన్నది నా జీవితాశయంగా మారింది. ఇన్నేళ్ళకి నా జన్మం తరించినట్టుగా భావిస్తున్నాను. నా అభిమాన ప్రేక్షకుల హృదయాల్లో సీతమ్మవారంటే 'శోభారాణి' అనే అభిప్రాయాన్ని చిరస్థాయిగా నిలుపుకోగలగడం ఆ దేవి

అనుగ్రహంగా భావిస్తున్నాను. ఆ మహా సాధ్వి పాత్రను పోషించటానికి ముందు నేనెన్ని కఠిన నియమాలను పాటించానో పాఠకులకు చెప్పాలనుకుంటున్నాను. తెల్లవారుఝామునే లేచి ముందుగా మా వారి పాదాలకు నమస్కరించేదాన్ని. ఆ తరువాత చన్నీటి స్నానం చేసి సీతారాముల విగ్రహాల ముందు పూజా మందిరంలో గంటకు పైగా ధ్యానముద్రలో వుండేదాన్ని. ఉపవాసాలు పాటించే దాన్ని. సీతాదేవి పాత్రలో నేను కాస్త చిక్కిపోయి వున్నట్టు అభిమాన ప్రేక్షకులు గమనించే వుంటారు...''ఇలా యింకా ఎన్నో విషయాలు. అవి చదివి సినిమా చూసిన సిన్నోడికి శోభారాణి కనిపించలేదు తెరమీద. సాక్షాత్తూ ఆ సీత మహాతల్లి కనిపించినట్టయి పారవశ్యంతో మైమరచిపోయాడు. కాని ఇక్కడ తను చూస్తున్నది ?

అర్ధరాత్రి దాటింది.

శోభారాణి పడగ్గదిలోంచి వుండి వుండీ నవ్వులూ, అరుపులూ, బూతులూ వినిపిస్తున్నాయి. మెల్లగా చాప మీంచి లేచాడు. చెట్ల మధ్యగా నడుచుకుంటూ వెళ్ళి కిటికీ వారగా మల్లెపందిరి చాటున వొదిగి వింటున్నాడు. కిటికీలోంచి లేత నీలిరంగు వెలుతురులో నిండిన పడగ్గది కనబడుతోంది శోభారాణి ఒంటిమీద బట్టల్లేవు. ప్యారేలాల్ కూడా అర్ధ నగ్నంగా అసహ్యంగా అవుపిస్తున్నాడు. గ్లాసులో విస్కీపోసి ఆమెకు తాగిస్తున్నాడు. ఆమెని కబళించడానికి మీదికి వొరుగుతున్న వింత మృగంలా కనిపిస్తున్నాడు సిన్నోడికి. గ్లాసును మూలకి విసిరేసి ఆ మృగాన్ని తనపైకి లాక్కుంటోంది శోభారాణి. సిన్నోడికి కడుపులో తిప్పినట్టయింది. ఇక అక్కడ నిలబడలేకపోయాడు

ఎత్తయిన శిఖరాగ్రం మీద సీతమ్మవారు నిలబడివుంది. కొంచెం దూరంలో ఆమె కళిముఖంగా నుంచుని కన్నార్పకుండా ఆ దివ్యమంగళ స్వరూపాన్ని తిలకిస్తున్నాడు. కొండ చరియల్లోంచి హాహాకారాలు వినిపించినయ్. తల విరబోసుకుని కొండఅంచులమీంచి అరుచుకుంటూ పరిగెత్తుకొస్తోంది ఎవరో ఆడమనిషి. ఆమె నగ్నంగా వుంది. అర్థం కాని బూతులేవో తిడుతోంది. అమ్మవారి పట్టుచీరని బరబరా లాగి పారేస్తోంది. సీతమ్మ వారిని రక్షించడానికి ముందుకురికేడు. బట్టల్లేని ఆడమనిషి విసురుగా నెట్టేసింది ఆ ఇద్దరి ముఖాల్లోనూ శోభారాణి పోలికలు కనిపిస్తున్నయ్-వాళ్ళిద్దరూ తన కేసి చూసి పిచ్చిగా నవ్వుతున్నారు. నివ్వెరపోయేడు, నిలువెల్లా ఒణికిపోయేడు. ఆ యిద్దరూ కిందపడి పెనుగులాడుతున్నారు. దొర్లుకుంటూ పోతున్నారు. కొండ అంచుమీంచి జారి అగాధంలోకి పడిపోతున్నారు....—




కెవ్వున అరిచి లేచి కూర్చున్నాడు.

"ఏమైందిరా సిన్నోడా! కల గన్నావా!" అంటున్నాడు తాత.

సూర్యోదయ మౌతోంది

వెలుగు రేఖలు విచ్చుతుంటున్నాయి.

చెట్లమీది పక్షులు కిచకిచలాడు తున్నాయి.

"లే, లే. స్నానం చేసి తొరగా బట్టలు మార్చుకో. అమ్మగారిని చూపిస్తా" అని చుట్ట వెలిగించేడు తాత.

అయోమయంగా అలానే కూర్చుని వున్నాడు సిన్నోడు. "ఏరా లెగవేం! ఆలీసెమయిందంటె మల్లా సూటింగు కెళ్ళద్ది అయమ్మ. లేచి మొగం కడుక్కో-" తొందర చేస్తున్నాడు తాత.

"ఒద్దు తాత! నేనాయమ్మని సూణ్ను. నన్నీరోజే బసెక్కించేసెయ్. మాపూరి కెల్లోతా" అన్నాడు సిన్నోడు కళ్ళు నులుముకుని.

మొదట్లో విస్తుపోయి చూసేడు. ఆ తరువాత ఏదో అర్థమైనట్టు వేదాంతిలా నవ్వుకున్నాడు ఎంకన్న తాత.

